క్లుప్తంగా

అమ్మవారి కిరీటానికి బంగారం విరాళం



బంగారం అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో ముత్యాలమ్మ తల్లి అమ్మవారికి బంగారు కిరీటం నిమిత్తం ఎస్ఎస్ఆర్ స్టోర్సు నిర్వాహకులు మూడు గ్రాముల బంగారం విరాళంగా ఆదివారం అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

కూర్మనాథున్ని దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ



ఆలయ సన్నిధిలో వెంకటేష్

గార: శ్రీకూర్మనాథున్ని తమిళనాడు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ టి.ఎస్.వెంకటేష్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. లక్ష్మీ సన్నిధి, తాబేళ్ల పార్కు, వైష్ణవీ దుర్గను దర్శించుకున్నారు. క్షేత్ర మహత్యాన్ని శ్రీనివాసాచార్యులు తెలియజేయగా, స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ ఈవో కె.నరసింహనాయుడు అందజేశారు. ఆయనతో పాటు తహశీల్దార్ ఎం.చక్రవర్తి ఉన్నారు.

దత్తపీఠంలో గణపతి హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్తనాథ క్షేత్రంలో మూడో ఆదివారం సందర్భంగా గణపతి హోమం నిర్వహించారు. ముందుగా దత్తాత్రేయ స్వామివారికి గ్రహదోష నివారణ కోసం భక్తులతో తైలాభిషేకాలు చేయించారు. అర్చకులు సింహాచల శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, పూర్ణాహుతి జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు ఆషాఢం సారె



సారె సమర్పిస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

జి.సిగడాం: మండలంలోని ఎస్.పి.ఆర్.పురంలో ఆదివారం ఆషాఢమాస పూజలు నిర్వహించారు. గ్రామదేవతకు చీర, గాజులతో సారె అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కంది రమాదేవి, మహిళలు పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో అరకు ఎంపీ



గార: ఆదికూర్మ క్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో కె.నరసింహనాయుడు స్వామి చిత్రపటాన్ని, క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు. ఎంపీతో పాటు పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఉన్నారు.

ప్రొఫెసర్ గేదెల రవికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టాతో రవి

ఎచ్చెర్ల : శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో బయోసైన్సెస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ గేదెల రవి డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా అందుకున్నారు. ఐఐటీ గువాహటి ప్రొఫెసర్ వీరంకి వెంకటదాసు, ప్రొఫెసర్ కన్నన్ పక్షిరాజన్ మార్గదర్శకంలో 'స్టడీస్ ఆన్ ప్రొడక్షన్ ఆఫ్ లిపిడ్స్, కరోటినోడీస్ అండ్ బేటా కరోటిన్ బై ద వలీజినోస్ ఈస్ట్ రోడిటోరియల్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈయన పరిశోధన పత్రాలు సైన్స్ డైరెక్టర్, స్పింగర్ టేలర్ అండ్ ఫ్రాన్సిస్ వంటి అంతర్జాతీయ పబ్లిషింగ్ సంస్థలకు చెందిన జర్నల్స్‌లో కూడా ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా రవిని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కేవీడీజీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ, సిబ్బంది శివప్రవీణ్, తదితరులు ఆదివారం అభినందించారు.

పల్లెల్లో 'బెల్టు' జోరు

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో విచ్చలవిడిగా బెల్టుషాపుల నిర్వహణ
- వేకువజాము నుంచి అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న అమ్మకాలు
- టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడుతున్న మద్యం



లావేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు (ఫైల్)



రణస్థలంలో ఇటీవల స్వాధీనం చేసుకున్న బీరు బాటిళ్లు

రణస్థలం : కూటమి పాలనలో మద్యం ఏరులై పారుతోంది. మద్యం షాపులతో పాటు బెల్ట్‌షాపులు కూడా కూటమి నాయకులే విచ్చలవిడిగా నడుపుతున్నారు. ప్రతి గ్రామంలో పదికి పైగానే బెల్ట్ షాపులు నడుస్తున్నాయంటే ఏ స్థాయిలో మద్యం వ్యాపారం సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కొన్ని మద్యం దుకాణాల నుంచి నేరుగా గ్రామాల్లోని బెల్ట్ షాపులకు నిర్వాహకులే తరలిస్తూ భారీగానే ధనార్జన అర్జిస్తున్నారు. ఇదంతా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీల్లో బహిర్గతమైన బహిరంగ రహస్యం. ఇటీవల ఎచ్చెర్ల నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్వాహకుల నుంచి భారీ మొత్తంలో అక్రమ మద్యం దొరకడం నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు తప్ప స్థానిక ఎక్సైజ్, పోలీసులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల చిన్నపాటి మొత్తంలో అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల దొరికిన మద్యం కేసుల వివరాలు ఇలా..

- ఈ నెల 1న లావేరు మండలం కొత్తకుంకాంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న లంకలపల్లి శ్రీనివాసరావు నుంచి 217 బాటిళ్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు.
- గత నెల 28న బుడుమూరు నుంచి దువ్వాడపేటలో బెల్ట్ షాపు కోసం దన్నాన రాంబాబు అనే వ్యక్తి 144 బాటిళ్లు తరలిస్తుండగా పట్టుబడ్డాడు.
- గత నెల 28న బుడుమూరు నుంచి తామాడలో బెల్ట్ షాపులకు వెయ్యడానికి నిర్వాహకుడు కొరగాన రాజేష్ 96 బాటిళ్లు తీసుకెళ్తుండగా పట్టుబడ్డాడు.
- గత నెల 8న బుడుమూరు నుంచి కొత్తూరుపేట బెల్ట్ షాపునకు 36 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా నిర్వాహకుడు కింతలి లక్ష్మణరావు పట్టుబడ్డాడు.
- మే 4న రణస్థలం మండలం సంచాం గ్రామ పరిధిలో గంట్యాడ సాయి, మీసాల రాము, బొంతు గణేష్‌ల నుంచి 193 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.
- మే 7న రణస్థలం మండలం పిషిని గ్రామ శివారులో దమరసింగి శంకరావు నుంచి 24 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.
- ఏప్రిల్ 1న ఎక్సైజ్ కానిస్టేబుల్ బొండేపల్లి జగదీష్ నుంచి 52 బీర్లు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.
- జి.సిగడాం మండలం బాతువలో బెల్ట్ షాపుకు తరలిస్తున్న 400 మద్యం బాటిళ్లు పట్టుకున్నారు.

ఆ వైపు వెళ్లొద్దు..

గ్రామాల్లో బెల్ట్‌షాపులు తొలగిస్తామని, మద్యం షాపుల్లో తప్ప గ్రామాల్లో ఎక్కడా మద్యం బాటిళ్లు కానరావని గత ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక కానరాకుండా పోయారు. దీనికితోడు మద్యం షాపులు, బెల్ట్ షాపులన్నీ మనవాళ్లే నిర్వహిస్తున్నారని, ఆ వైపు వెళ్లవద్దని ఎక్సైజ్, స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీ చేశారని సమాచారం. ఇటీవల ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఓ ప్రజా ప్రతినిధి, కార్యకర్త వద్ద 23 బీరు బాటిళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుంటే స్థానిక పోలీసులపై ఒచ్చిన ఒత్తిడితో కేసు నమోదు చేయలేదని తెలిసింది.

ఆరు నెలల్లో 81 కేసులు

గత ఆరు నెలల్లో రణస్థలం, లావేరు మండలాల పరిధిలో అనధికార బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 81 మందిపై కేసులు నమోదు చేశాం. మూడు బృందాలతో నిత్యం తనిఖీలు చేపడుతున్నాం. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–ఎల్.అనురాధదేవి, రణస్థలం ఎక్సైజ్ సీఐ

చంద్రబాబువన్నీ బూటకపు హామీలే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్. చిత్రంలో ధర్మాన కృష్ణదాస్ తదితరులు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే కిరణ్
- లావేరులో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

ఎచ్చెర్ల : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలతోనే గద్దెనెక్కారని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలం బెజ్జిపురంలో ఆదివారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పేరుతో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తప్పుడు హామీలు, అబద్ధపు మాటలతో గెలిచారన్నారు. సినిమా వ్యామోహంలో యువత కూటమి వైపు అటువైపు ఆకర్షితులయ్యారని చెప్పారు. మనం చేసిన మంచి కూడా ప్రచారం చేయలేకపోయామని, ఈ తరుణంలో బాబు చేసిన మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలన సాగిస్తోందన్నారు. రానున్న కాలంలో జగనన్న ప్రభుత్వంలో వడ్డీతో సహా చెల్లిస్తామని స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ జగనన్న పేదలకు వీలైనంత వరకు మేలే చేశారని అన్నారు. అబద్ధాల చంద్రబాబుతో జగనన్నను పోల్చడం సరికాదన్నారు. చిన్న పొరపాటు కూడా పార్టీ నుంచి రాకుండా అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ఎంపీపీ అమ్మాజమ్మ, ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, బల్లాడ హేమమాలినిరెడ్డి, కాయల రమణ, జి.సిగడాం ఎంపీపీ ప్రతినిధి మీసాల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, ఎచ్చెర్ల మండల పార్టీ అధ్యక్షుడు బోర సాయిరాం, డోల వెంకటరమణ, గొర్లె శ్రీనివాసరావు, జిల్లా కమిటీ నాయకులు, మండల కమిటీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న బోటనీ, ఒకేషనల్ సీఈటీ, ఒకేషనల్ ఎంఎండ్‌టీ పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీలతో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. బోటనీ పోస్టుకు సంబంధించి ఎమ్మెస్సీలో 50 మార్కులు, ఒకేషనల్ సీఈటీ పోస్టుకు బీటెక్/బీఈ సివిల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఎంఅండ్‌ఏటీ పోస్టుకు బీటెక్/బీఈ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసినవారు అర్హులని పేర్కొన్నారు. బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను ఈ నెల 15లోగా కళాశాలలో అందజేయాలని కోరారు.

రణస్థలం: రణస్థలం జూనియర్ కళాశాల భౌతికశాస్త్రం అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ అర్హత కలిగిన వారు అర్హులని, ఈ నెల 15లోపు రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ధ్రువపత్రాలు అందజేయాలని కోరారు. ఈ నెల 18న ఉదయం 10గంటలకు శ్రీకాకుళం బాలుర జూనియర్ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

శ్రీకాకుళం: సోంపేట మండలం బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ గెస్ట్ లెక్చరర్గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.సౌజన్య ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 15లోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

కూటమి వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం



చెట్టుపొదిలాంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జి.సిగడాం: ఎన్నికల ముందు ప్రజలకు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్‌తోపాటు 143 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేశారని, కూటమి నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ అన్నారు. ఆదివారం చెట్టుపొదిలాం, మధుపాం గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది పాలనలో ఎటువంటి సంక్షేమం అమలు చేయలేదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో జగనన్నకు లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకపోతున్నారని చెప్పారు. అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భూపతి సురేష్, కిల్లారి ఆనందరావు, నల్లి తవిటినాయుడు, మాజీ ఎంపీటీసీ భూపతి సుధారాణి, ఎందువ మురళి, ముగ్గు శ్రీనివాసరావు, అసిరినాయుడు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థ పటిష్టం కావాలి



మాట్లాడుతున్న రమణమూర్తి

గార: కుటుంబ వ్యవస్థ మరింత పటిష్టం కావాల్సిన అవసరం ఉందని ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ డి.వి.రమణమూర్తి అన్నారు. ఆదివారం కె.మత్స్యలేశంలోని మత్స్యనారాయణ స్వామి ఆలయంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాలు ఛిన్నాభిన్నం కావడంతో హిందువుల్లో ఐక్యత కొరవడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత క్రియాశీలంగా వ్యవహరించాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్య అందరిపై ఉందని, మొక్కలు నాటేందుకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో బుద్దా ఎర్రన్న, గంగాడ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతోనే నా ప్రయాణం



కిరణ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జె.ఆర్.పురం నాయకులు

రణస్థలం: ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం ప్రజలతోనే నడుస్తానని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కిరణ్ పుట్టినరోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితం ఈ స్థాయికి చేరుకోవడానికి వైఎస్సార్, జగనే కారణమని గర్వంగా చెప్పగలనన్నారు. జగనన్న సూచించిన బాటలో నడుస్తూ ప్రజలకు అండగా నిలబడతానని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు



బెండి బాబ్జీ

జి.సిగడాం: మండల రైతన్నలకు సకాలంలో ఎరువులను అందిస్తున్నామని జి.సిగడాం వ్యవసాయాధికారి బెండి బాబ్జీ అన్నారు. ఆదివారం పెంట రైతుసేవా కేంద్రం వద్ద ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి.సిగడాం పీఏసీఎస్ ద్వారా 20 టన్నులు, బాతువ పీఏసీఎస్ ద్వారా 20 టన్నులు, వాండ్రంగి ఆర్ఎస్‌కేలో 20 టన్నులు, పాలఖండ్యాంలో 20 టన్నులు, వెలగాడలో 20 టన్నులు, సేతుభీమవరంలో 20 టన్నులు, నడిమివలసలో 20 టన్నులు, బాతువలో 20 టన్నులు, మెట్టవలస 20 మెట్రిక్ టన్నులు, పెంటలో 20 మెట్రిక్ టన్నులు, మధుపాం, నిద్దాం గ్రామాల్లో 40 టన్నులు చొప్పున ఎరువులు పంపిణీ చేశామని వివరించారు.

కొనసాగుతున్న హరికథ ప్రదర్శనలు



తులసిని సత్కరిస్తున్న సుమిత్రా సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో పులఖండం శ్రీనివాసరావు స్మారకార్థం నిర్వహిస్తున్న హరికథ ప్రదర్శనలకు విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం అనకాపల్లికి చెందిన తోట తులసి భాగవతారిణి ని 'శివపర్యటన' కథ చక్కగా వినిపించగా, వయొలిన్‌పై దుంపల ఈశ్వరరావు, మృదంగంపై చలపరాయి వినోద్‌కుమార్‌లు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో సుమిత్రా కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, నక్క శంకరరావు, బంకుపల్లి రమేష్‌శర్మ, పి.ఎ.ఎస్. శాస్త్రి, కొంక్యాన వేణుగోపాల్, కొంక్యాన మురళీధర్, వి.వి.ఆర్.మూర్తి, యు.పూజ, ఎం.రాజు, జ్యోతి, ఎం.వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పేటలో పారిశుద్ధ్య లోపం



నివాసాల్లో నిలిచిన మురుగునీరు



కాలువలు లేక నిలిచిపోయిన వాడుక నీరు




ఈగలు, దోమలకు నిలయంగా..

- సీపన్నాయుడుపేటలో ఎక్కడి చూసినా మురుగే
- కంపుకొడుతున్న పరిసరాలు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం రూరల్:

నగర పరిధిలోని 50వ డివిజన్ సీపన్నాయుడుపేటలో పారిశుద్ధ్యం లోపించింది. రహదారి విస్తరణలో భాగంగా ఇక్కడి కాలువలు ప్రధాన రోడ్డుగర్భంలో కలిసిపోయాయి. అప్పటి నుంచి వాడుక నీరు వెళ్లే దారి లేక ఆవాసాల్లోనే నీరు నిలిచిపోతోంది. దీనికితోడు వర్షపు నీరు సైతం నిల్వ ఉండిపోవడంతో ఇంటి పరిసరాలు చెరువును తలపిస్తున్నాయి. దుర్వాసన భరించలేక కొందరు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా మున్సిపల్ యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా..



మా గ్రామంలో పల్లెనిద్రలో భాగంగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ రావడంతో ఆయన దృష్టికి పారిశుద్ధ్య సమస్య తీసుకెళ్లారు. ఈ విషయమై ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా ఫలితం లేకపోయింది. కొన్ని నెలలుగా మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో తాగేందుకు వాడుతున్న మంచినీరు సైతం కలుషితంగా మారుతోంది.

– సీపాన రామారావు, సీపన్నాయుడుపేట

కాలువలు నిర్మించాలి

మా గ్రామంలో కొత్తగా కాలువలు నిర్మించాలి. ప్రస్తుతం ఉన్న కాలువల్లో పూడికలు ఎక్కువై ఎక్కడి నిల్వ నీరు అక్కడే ఉండిపోతుంది. దీనివల్ల ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన మురుగు ఒకేచోట ఉండిపోతోంది. జాతీయ రహదారి రోడ్డు వెంబడి కాలువలు కడితే మా సమస్య పరిష్కారమవుతుంది.

– సనపల రామారావు, సీపన్నాయుడుపేట

ఉండలేకపోతున్నాం

మా ఇంటి పరిసర ప్రాంతంలో కొంతకాలంగా మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో చుట్టుపక్కలా ఉన్న కొంతమంది ఖాళీ చేసేశారు. ఈగలు, దోమలు ఎక్కువై రాత్రుళ్లు నరకం చూస్తున్నాం. మురుగునీరు బయటకు పంపే మార్గం చూపాలి.

– మేటికోటి సత్యవతి, సీపన్నాయుడుపేట

మా దృష్టికి వచ్చింది..

సీపన్నాయుడుపేటలో మురుగునీటి సమస్య మా దృష్టికి వచ్చింది. దీన్ని పరిష్కరించాలంటే కొత్తగా కాలువలు నిర్మించాల్సి ఉంటుంది. ఈ మేరకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– శ్రీధర్, మున్సిపల్ హెల్త్ అధికారి

యువ రచయితల వేదిక కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో ఆదివారం యువ రచయితల వేదిక నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా సురంగి మోహనరావు, అధ్యక్షులుగా తంగి ఎర్రమ్మ, ప్రధాన కార్యదర్శిగా బలివాడ ధనుంజయరావు, గౌరవ సలహాదారులుగా ప్రొఫెసర్ విష్ణుమూర్తి, ఆరికతోట కనకరాజు, కార్యవర్గ సభ్యులుగా గణస్వామి, లింగరాజు, కె.శ్రీనివాసరావు, కర్నేన జనార్దనరావు, కోశాధికారిగా రాకోటి చిన్నారావు, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా సోడవరం ఈశ్వరరావు, గుడిమెట్ల గోపాలకృష్ణ, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కవులు తమ కవితలను వినిపించారు. సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలియజేశారు.

వేంకటేశ్వరునికి జన్మనక్షత్ర పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలు జరిగాయి. అర్చకులు బూరాడ వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, భజన మండలి ఆధ్వర్యంలో తిరువీధి భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి

పొందూరు: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా బదిలీపై స్థానాలు మారిన వారికి తక్షణమే జీతాలు చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న విజ్ఞప్తి చేశారు. పొందూరులో ఆదివారం డీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి రాజశేఖర్‌తో కలిసి మాట్లాడారు. పొజిషన్ ఐడీ నంబర్లు కేటాయించకపోవడంతో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.